స్కెచ్

# చీర తెచ్చిన ప్రమాదం

ద్రోణంరాజు కృష్ణమోహన్

ఇంట్లో రోజూ అత్తాకోడళ్ళకు యుద్ధం జరుగుతూనే వుంది. రాజారావుకు మనసు మనసులో లేదు. ఏదో విధిలేక ఆఫీసుకు పోయి వస్తున్నాడు. ఇంటికి రాగానే రోజూ యేదో ఒక రిపోర్టు చెవిని పడేది. తల్లిని సమాధానపరచాలా, భార్యనా? నిజంగా అతని దృష్టిలో యిద్దరూ సమానులే. ఇంకా ఎప్పుడైనా కోప్పడితే భార్యనే కోప్పడేవాడు గాని తల్లిని మాత్రం పల్లెత్తుమాట అనేవాడు కాదు. పెళ్ళి అయి రెండేళ్లు కూడా కాలేదు. ఇంతవరకు వొక్కరోజు కూడా హాయిగా గడిపి ఎరగడు.

ఆనాడు గురువారం. ఇంటికి వచ్చి "బీచికి వెళదామా" అని అడిగాడు భార్యని.

"బీచి కాదు, నామొహం! ఎక్కడకూ తగలడను ఒక్కసారే యేకంగా యేదైనా వూరు వెడతా. కాస్త మనశ్శాంతి వుంటుంది" విసుగ్గా గొణిగింది భార్య సావిత్రి.

"నువ్వెందుకు పోవాలి! నేనే యే కాశీకో ప్రయాణం కడితే కొంపలో శని విరగడయి పోతుంది... నామూలంగా మీ యిద్దరు విడిపోవడ మెందుకు? నామీద అపనింద వేయడానికా!" కంట తడిబెట్టింది తల్లి.

"అబ్బబ్బ! చచ్చిపోతున్నా మీతో. నలుగురూ వింటే నవ్వుతారన్న సిగ్గు లేదూ మీకు? నేనే చస్తే మీ యిద్దరూ హాయిగా వుంటారేమో!" నెత్తి బాదుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు రాజారావు.

భార్య, తల్లి, యిద్దరూ కిక్కురు మనలేదు యీ మాటతో.

ఆరాత్రి సావిత్రి యింటిపని ముగించి భర్త దగ్గరకొచ్చి కాసేపు మౌనంగా కూర్చుని,

"నన్ను నెల్లూరు పంపండి మా అన్నయ్య దగ్గరకు" తల వంచుకుని మెల్లిగా అన్నది సావిత్రి.

"లక్షసార్లు చెప్పాను మీ అన్నయ్య దగ్గరకు పంపనని. కావలిస్తే బెజవాడ వెళ్లు. మీ చెల్లెలు, అమ్మమ్మ, వున్నారుగా అక్కడ"

కాసేపు యేదో ఆలోచించి సావిత్రి "సరేలెండి, రేపు ప్రొద్దున్నే జనతా ఎక్స్‌ప్రెస్‌కు వెడతా. అది ఖాళీగా వుంటుంది."

"తగలడు. ఎన్నాళ్లుంటావో వుండిరా. మన ముగ్గురికీ కొంతకాలం విశ్రాంతి అన్నా వుంటుంది."

"అలాగే తగలడతా లెండి మీకంత కోరికగా వుంటే."

మర్నాడు ప్రయాణం కట్టింది. ఎంత పోట్లాడినా విడిపోయేటప్పుడు అత్తాకోడళ్లు బిక్కచూపులు చూచుకున్నారు. వాళ్ళ హృదయవేదన గమనించాడు రాజారావు. స్టేషను దగ్గర మళ్ళీ సావిత్రి,

"ఏమండీ, ఒక్కసారి మా అన్నయ్య దగ్గరకు పంపండి. పెళ్ళి అయింతర్వాత మళ్ళీ చూడలేదు వాడిని."

"వీల్లేదు. బెజవాడకే టికెట్టు కొంటా" అని గద్దించి బెజవాడకి టికెట్టు తీసిచ్చాడు భార్యకి. పెట్టెలో ఎక్కువమంది జనంలేరు. ఇంకా పావుగంట వైముంది బయలుదేరటానికి. ఆఫీసుకు వేళవుతోందని చెప్పి కోపంతో, బాధతో, వెళ్ళిపోయ్యాడు.

మధ్యాహ్నం పన్నెండుగంటలకి కాస్త మనస్సు చల్లబడింది రాజారావుకి. భార్య ఇదివరకెన్నడూ వొంటరిగా ప్రయాణంచేసి యెరగదు. వెంటనే వెళ్ళి టెలిగ్రాం యిచ్చాడు మరదలిపేర స్టేషనుకు వచ్చి తీసికెళ్ళమని.

మరునాడుదయం పేపర్లో "ఎవరో ఎర్రచీర కట్టుకొన్న యువతి, పద్ధెనిమిది సంవత్సరాల వయసు, నెల్లూరు సమీపంలో నదిలో దూకేసింది. ఆత్మహత్యకు కారణం తెలియదు. మనిషి ఎవరో తెలియదుగాని, ఆడవాళ్ళ కంఠాలు

మెంటు నుంచి దూకింది" అని చదివేటప్పటికల్లా తల్లీ కొడుకుల గుండెలు దడదడ కొట్టుకున్నాయి. సావిత్రి కట్టుకుని వెళ్ళింది నిజంగా ఎఱ్ఱ చీరే! ఒక టెలిగ్రాం యిచ్చారు బెజవాడకు. ఒంటిగంటకల్లా జవాబొచ్చింది సావిత్రి రాలేదని.

గొల్లుమన్నారు యిద్దరూ యింట్లో. టెలిగ్రాం యిచ్చారు మళ్ళీ బెజవాడకు, వెంటనే బయలుదేరి రమ్మని. నెల్లూరుకు కూడా టెలిగ్రాం వెళ్ళింది అర్జంటుగా రమ్మని. ఆదివారం వుదయం మెయిలులో సావిత్రి చెల్లెలు, అమ్మమ్మ, వచ్చారు. ఒకళ్ళనొకళ్లు కౌగిలించుకుని బావురు మన్నారు.

రాజారావు మేనమామ కూడా దిగాడు తెనాలినుంచి. వస్తూనే ఎదురుగుండా వున్న రాజారావుని కౌగిలించుకుని యేడ్చాడు. ఏదో తినలేక నాలుగు మెతుకులు నోట్లో వేసుకున్నారు. మొదలెట్టాడు రాజారావు మేనమామ రాఘవయ్య "నేనప్పుడే చెప్పాను దీని జాతకం మంచిది కాదని. వెధవ కట్నంకోసం ఆశ పడి నా కూతుర్ని వొద్దన్నావు. అయినా మించి పోయిందేమీలేదు. రెండోదానికి పది హేనో యేడు..." అని యింకా యేదో చెప్ప బోతూవుంటే రాజారావు విసుగుతో చేతిలోవున్న పెన్ను నేలకేసి కొట్టి వాకిట్లోకి వెళ్ళాడు. రాఘవయ్య ధడుచుకున్నాడు.

మధ్యాహ్నం సరిగ్గా వొంటిగంటకు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వొకటి వచ్చింది. అది నెల్లూరునుంచి. విప్పి చదివాడు రాజారావు. "సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌లో సావిత్రితో వస్తున్నాను. స్టేషనుకు రావలెను.

ఆనందరావు"

సాయంత్రం స్టేషనులో సావిత్రిని చూడగానే "అమ్మా, వచ్చావే, నా తల్లీ," అంటూ యేడ్చింది అత్తగారు కోడల్ని కౌగిలించుకుని.

సావిత్రి చేసిన ఘనకార్యం యేమిటంటే, భర్త వెళ్ళిపోగానే బెజవాడ టికెట్టు యిచ్చేసి నెల్లూరుకు పుచ్చుకుంది. నదిలో దూకిన స్త్రీ మాట వాస్తవమేనని సావిత్రి [illegible]ంది. ఆమె కట్టుకున్నది కూడా ఎఱ్ఱచీరేనట!


(ESTD: 1907)



దక్షిణ ఇండియాలో ముఖ్యమైన వూళ్లన్నిటిలోను; బొంబాయిలోను బ్రాంచీలు కలవు.

| | | |
|---|---|---|
| చందా వేసిన మూలధనము | .. | రు. 72,00 000 |
| చెల్లించిన మూలధనము | ... | రు. 53 00,000 |
| రిజర్వు ఫండ్ | ... | రు. 62,00,000 |

అన్ని విధములయిన బ్యాంకింగ్ వ్యాపారములు చేయబడును

ఎస్. గోపాల అయ్యర్, సెక్రెటరీ.

# ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్.
## హెడ్డాఫీసు : మదరాసు

N.P.B